సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 22 । ఆగస్టు । 2024



అరకొరగా డయాలసిస్ పడకలు

జిల్లాలో కిడ్నీ రోగుల సంఖ్య నానాటికీ పెరుగుతుండగా ప్రభుత్వాస్పత్రుల్లో డయాలసిస్‌కు పడకలు సరిపోవడం లేదు. 8లో



రామకోటి పుస్తకాల నిమజ్జనం

శ్రీసీతారామచంద్ర స్వామివారికి భక్తులు సమర్పించిన శ్రీరామకోటి పుస్తకాలను బుధవారం గోదావరిలో నిమజ్జనం చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ ప్రభావం, ఉక్కపోత ఎక్కువగా ఉంటాయి.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుకను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు భద్రాచలానికి డిప్యూటీ సీఎం భట్టి



భద్రాచలం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం భద్రాచలంలో పర్యటించనున్నారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులై, తొలిసారి భద్రాచలం వస్తున్న పొదెం వీరయ్యకు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నేడు సన్మానించేందుకు స్థానిక పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి భట్టి హాజరవుతారని అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆయన భద్రాచలం చేరుకుంటారని, తిరిగి సాయంత్రం 4.30 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి హైదరాబాద్ వెళ్తారని పేర్కొన్నారు. కాగా, పొదెం వీరయ్య సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరారు.

బాలుర హాస్టల్‌లో న్యాయమూర్తి తనిఖీ



వార్డెన్‌కు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్ : పట్టణంలలోని బాలుర వసతి గృహాన్ని భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనశాల, నిద్రించే స్థలం, స్నానాల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, వంటశాలలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని వార్డెన్‌కు సూచించారు. క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకుంటేనే బంగారు భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. చైతన్య, లీగల్ రిటైనర్ లాయర్లు పి. వెంకటేశ్వర్లు, తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో బదిలీలకు దరఖాస్తులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని 14 కేజీబీవీల్లో విధులు నిర్వర్తిస్తూ రెండేళ్ల సర్వీస్ పూర్తయిన ఉద్యోగుల నుంచి బదిలీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. అర్హులైన స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్‌టీలు, పీజీసీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్‌ఎంలతో పాటు అకౌంటెంట్లు జిల్లా పరిధిలో బదిలీ కోసం గురువారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రెండురోజులు కార్యక్రమాలు నిర్వహించాలి..

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గురు, శుక్ర వారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ వెంకటేశ్వరాచారి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం కోసం ప్రతిపాదిత థీమ్, అంతరిక్ష సాంకేతికత, దాని అనువర్తనాల పట్ల దేశంలోని యువతను నిమగ్నం చేయడం, ప్రేరేపించడం ఈ వేడుకల లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులంతా 'భారత్ ఆన్ ది మూన్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, వివిధ కార్యకలాపాలను యాక్సెస్ చేయాలని, 22, 23 తేదీల్లో అన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు, వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు నిర్వహించాలని పేర్కొన్నారు.

ఈసారీ ఇక్కట్లేనా?

నత్తనడకన వైద్య కళాశాల నిర్మాణం

- మధ్యలో ఏడాది పాటు ఆగిన పనులు
- ఇప్పుడు నిధులున్నా వేగం పెరగని వైనం
- ప్రవేశాలకు సిద్ధమవుతున్న మూడో బ్యాచ్ విద్యార్థులు
- పని ప్రదేశంలో కార్మికులకు రక్షణ కరువు



నత్తనడకన సాగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాకే తలమానికమైన వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడో బ్యాచ్ విద్యార్థులు అడ్మిషన్లకు సిద్ధం అవుతున్నప్పటికీ ఇప్పటికీ తరగతి గదులు అందుబాటులోకి రాలేదు.

డెడ్‌లైన్.. డిసెంబర్

2021 – 22 విద్యా సంవత్సరంలో జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైంది. దీనికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల కూడా వచ్చింది. ఈ మేరకు నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణ పనులు ముందుగానే పూర్తయ్యాయి. ప్రస్తుతం ఈ భవనాల్లోనే మెడికల్ కాలేజీ తరగతులు నడుస్తుండగా, అద్దె భవనంలో నర్సింగ్ కాలేజీ కొనసాగుతోంది. అయితే మెడికల్ కాలేజీకి సంబంధించి పూర్తిస్థాయిలో కాలేజీ తరగతులు, బాల బాలికలకు వేర్వేరుగా హాస్టళ్లు, మెస్, రెసిడెంట్ వైద్యుల క్వార్టర్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.130 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి అన్ని నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది.

పొంగులేటి చొరవతో బిల్లులు..

మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రారంభంలో పనులు చకచకా చేపట్టారు. అయితే ఈ పనులకు సరిపడా ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాలేదంటూ 2023 జూన్‌లో అర్ధంతరంగా నిర్మాణ పనులు నిలిపేశారు. ఇక్కడ పని చేయాల్సిన కార్మికులు, యంత్రాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో దాదాపు ఎనిమిది నెలల పాటు దీనిపై ఎవరూ దృష్టి సారించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకుని పెండింగ్ బిల్లులు రూ.30 కోట్ల వరకు మంజూరు చేయించారు. దీంతో నిర్మాణ పనుల్లో వేగం పెరుగుతుందనే ఆశలు కలిగాయి.

అయినా నత్తనడకనే..

మెడికల్ కాలేజీ మూడో బ్యాచ్ విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభానికి సమయం సమీపిస్తున్నా కళాశాల భవనాలు అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రణాళిక ప్రకారం కాలేజీ అకడమిక్ క్లాసులు నిర్వహించే భవనం జీ ప్లస్ 4, బాయ్స్, గర్ల్స్ హాస్టళ్లు జీ ప్లస్ 5 పద్ధతిలో నిర్మిస్తుండగా మెస్, స్టాఫ్ క్వార్టర్లు జీ ప్లస్ 2గా నిర్మించాల్సి ఉంది. కానీ ఈ భవనాల నిర్మాణ పనులు ఇప్పటికీ జీ ప్లస్ వన్ శ్లాబ్ దగ్గరే ఉన్నాయి. నిధుల కొరత లేకపోయినా ఆశించిన వేగంతో ఇక్కడ పనులు జరగడం లేదు. కొద్ది మంది కార్మికులతోనే పనులు చేయిస్తున్నారు. పైగా భవన నిర్మాణ కార్మికులకు ఏ మాత్రం రక్షణ ఏర్పాట్లు చేయలేదు. కనీసం హెల్మెట్లు, గమ్‌బూట్లు కూడా అందించడం లేదు.



రక్షణ పరికరాలు లేకుండా పని చేస్తున్న కార్మికులు

ఈ ఏడాదీ ఇబ్బందులు తప్పవా..?

మెడికల్ కాలేజీలో ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు సంబంధించి 300 మంది విద్యార్థులు ఉన్నారు. బాయ్స్ హాస్టల్ మంచికంటి నగర్ ఏరియాలో, గర్ల్స్ హాస్టల్ మార్కెట్ ఏరియాలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. రెండు బ్యాచ్‌ల విద్యార్థులతో ఇప్పటికే అద్దె భవనాలు కిక్కిరిసి ఉన్నాయి. పైగా హాస్టల్‌లో మెస్ బాగాలేదంటూ ఆరు నెలల క్రితం విద్యార్థులు ఆందోళన కూడా చేశారు. మరో రెండు నెలల్లో మూడో బ్యాచ్‌కు సంబంధించి మరో 150 మంది విద్యార్థులు ఇక్కడికి రానున్నారు. ఇప్పటికైనా కాలేజీ భవన నిర్మాణ పనుల్లో వేగం పెరగకుంటే ఇటు మెడికల్, అటు నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు ఇక్కట్లు తప్పవు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దు

- చట్టవిరుద్ధంగా అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా జడ్జి పాటిల్ వసంత్ హెచ్చరిక



మాట్లాడుతున్న పాటిల్ వసంత్, పక్కన కలెక్టర్

సింగరేణి(కొత్తగూడెం): చట్ట విరుద్ధంగా అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ హెచ్చరించారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆడపిల్లలను ఎదగనీయాలని అన్నారు. ఆడ, మగ అంటూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే ఆయా ఆస్పత్రుల అనుమతులు రద్దు చేయాలని సూచించారు. ఆడపిల్లలపై జరుగుతున్న దాడులను నిరోధించేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ ఆస్పత్రులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, గర్భవిచ్ఛిన్న ఆపరేషన్లు చేసే వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్, పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చైతన్య, డాక్టర్ బాలాజీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఫైజ్ మొహినుద్దీన్, డీసీపీఓ ఎం.కుమారి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానం అందించే బాధ్యత టీచర్లదే..

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పక్కన డీఈఓ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులకు అవసరమైన జ్ఞానాన్ని అందించే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని, ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను తయారుచేసి వారికి మంచి భవిష్యత్ ఇవ్వాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లాలో ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు కొత్తగూడెంలోని ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సామర్థ్యాలు అందించడంలో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులు పదోన్నతి ద్వారా ఉన్నత పాఠశాలలకు వెళ్తున్నారని, అక్కడి పరిస్థితులు, బోధన, పరీక్ష విధానాలు వేరుగా ఉంటాయని, ఆ సమస్యను అధిగమించేందుకు శిక్షణ ఉపకరిస్తుందని అన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు పరచి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ జిల్లాలో 680 మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందగా మొదటి విడతలో 130 మంది ఇంగ్లిష్, ఫిజిక్స్, సోషల్ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ అందిస్తున్నామని వివరించారు. ఏమైనా సందేహాలుంటే ఇక్కడ నివృత్తి చేసుకుని పాఠశాలలో నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. శిక్షణ సమన్వయకర్తగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ వ్యవహరించారు.

ఏసీబీ వలలో పంచాయతీ అధికారులు

రూ. 15వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎంపీఓ, కార్యదర్శి



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి

గుండాల : గ్రామ పంచాయతీలో చేసిన పనికి బిల్లులు చేసేందుకు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఆళ్లపల్లి ఎంపీఓ బత్తిన శ్రీనివాసరావు, మర్కోడు పంచాయతీ కార్యదర్శి తాటి నాగరాజు బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఆళ్లపల్లి మండలం మర్కోడు మాజీ ఉప సర్పంచ్ కుర్ర కమల ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ కింద రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు. కాగా ఆ పనులకు సంబంధించి కొన్ని డబ్బులు వచ్చాయి. ఇంకా రావాల్సిన డబ్బుకు సంబంధించి బిల్లులు చేయాలని ఎంపీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నాగరాజును కమల కోరారు. అయితే ఇందుకు రూ.15 వేలు లంచం ఇవ్వాలని వారిద్దరూ సూచించారు. దీంతో కమల ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. ఏసీబీ అధికారులు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. అదే సమయంలో కమల నుంచి మధ్యవర్తుల ద్వారా రూ. 15వేలు లంచం తీసుకుంటుండగా ఎంపీఓ, గ్రామ కార్యదర్శిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే తమకు సమాచారం అందించాలని సూచించారు.

పునఃప్రారంభమైన విద్యుదుత్పత్తి

- కేటీపీఎస్ పదో యూనిట్‌లో వార్షిక మరమ్మతులు పూర్తి
- 65 రోజులపాటు కొనసాగిన పనులు



కేటీపీఎస్ ఐదో దశ కర్మాగారం

పాల్వంచ: కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలోని పదో యూనిట్‌లో వార్షిక మరమ్మతులు విజయవంతంగా పూర్తయ్యాయి. 250 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో 65 రోజుల పాటు జెన్‌కో, బీహెచ్ఈఎల్, సీమాన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించారు. మంగళవారం రాత్రి పనులు పూర్తి చేసి యూనిట్‌ను రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేయగా, బుధవారం 205 మెగావాట్ల విద్యుదుత్పత్తి నమోదైంది. మరమ్మతు పనులకు రూ.16 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, యూనిట్ మరమ్మతు పనులు 45 రోజుల్లోనే పూర్తి కావాల్సి ఉండగా, మరో 20 రోజుల పాటు ఆలస్యంగా సాగాయి. జెన్‌కో డైరెక్టర్ బి.లక్ష్మయ్య పలుమార్లు మరమ్మతు పనులను పరిశీలించి పలు సూచనలు చేసినా జాప్యం జరగడం గమనార్హం. ఎట్టకేలకు పలు అవాంతరాలను అధిగమించి ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకొచ్చామని సీఈ ఎం.ప్రభాకర్‌రావు తెలిపారు.

9వ యూనిట్‌లో పునరుద్ధరణ..

కేటీపీఎస్ ఐదో దశ కర్మాగారంలోని 9వ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు. సోమవారం రాత్రి బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా 250 మెగావాట్ల సామర్థ్యం గల ఉత్పత్తిని అధికారులు నిలిపివేసిన విషయం విదితమే. కాగా మరమ్మతుల అనంతరం యూనిట్‌ను బుధవారం అందుబాటులోకి తీసుకొచ్చి రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు సీఈ తెలిపారు.

'ఆయుష్'ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మహేష్‌గౌడ్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మహేష్ గౌడ్ తదితరులు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మహేష్ గౌడ్ అన్నారు. అశ్వారావుపేటలోని ఆయుష్ ఆస్పత్రి వద్ద వయోవృద్ధులకు బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులకు పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలు అందుతాయని తెలిపారు. అనంతరం స్థానిక వైద్యాధికారి డాక్టర్ నంద్యాల దీపిక ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించి, ఉచితంగా ముందులు పంపిణీ చేశారు. అలాగే వైద్యానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ శిబిరంలో మొత్తం 78 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ జి.జ్యోతి, సిబ్బంది బి.విజయ్‌కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నిఘా.. ఏం చేస్తున్నట్టు..?

- భద్రాచలంలో పెచ్చుమీరుతున్న గ్యాంగ్‌వార్‌లు
- పోలీసుల రక్షణ, నిఘా లోపంపై విమర్శలు..!
- ఆందోళన చెందుతున్న భక్తులు, పర్యాటకులు, స్థానికులు



భద్రాచలం : 'మొన్న శిల్పినగర్‌లో ఇళ్ల మధ్యనే బీరు బాటిళ్లతో తలలు పగులగొట్టుకున్న యువకులు.. నిన్న భద్రాచలం నడిబొడ్డున సినిమా థియేటర్ వద్ద రాత్రి 8 గంటల ప్రాంతంలో కత్తితో ఓ యువకుడి వీరంగం.. తాజాగా గోదావరి ఒడ్డున బ్రిడ్జి సమీపంలో రాళ్ల నడమ ఓ మృత శిశువు దొరికిన ఉదంతం..' ఇవి భద్రాచలంలో జరుగుతున్న ఆకృత్యాలు, అఘాయిత్యాలకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. పట్టణంలో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారుతుండడంతో శాంతి భద్రతలు, పోలీసుల నిఘా వ్యవస్థ క్షీణిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. భద్రాచలం కేంద్రంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పని చేస్తున్నా.. ఇలాంటి ఘటనలు జరగడం పట్ల సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇలాంటి ఘటనలా..

ప్రశాంత ఆధ్యాత్మిక క్షేత్రంగా భద్రాచలానికి పేరుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులతో నిత్యం సందడిగా ఉండే పట్టణంలో ఇటీవల గ్యాంగ్‌వార్ సంస్కృతి పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఊరిబయట మాత్రమే అప్పుడప్పుడూ గుంపులుగా కనిపించే గ్యాంగ్‌ల కొట్లాట ఇటీవల పట్టణంలోకి ప్రవేశించింది. నిత్యం భక్తులు తిరిగే రామాలయ పరిసర ప్రాంతాలతో పాటు నివాసాల మధ్యనే యువకులు వర్గాలుగా విడిపోయి పరస్పరం మారణాయుధాలతో దాడులకు పాల్పడుతున్నారు. ఈ తరహా గ్యాంగ్ వార్‌లో ఎక్కువగా టీనేజ్ యువకులే కనిపిస్తుండటం శోచనీయం.

గంజాయి మత్తే కారణమా..?

భద్రాచలంలో పెరుగుతున్న గొడవలు, కొట్లాటలకు యువత గంజాయి సేవించడమే ప్రధాన కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో గంజాయి అక్రమ రవాణాకు అడ్డాగా ఉన్న భద్రాచలంలో నేడు యువకులు దాన్నే వాడుతుండడంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. యువకులు గంజాయి మత్తులో విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారు. వీటి నియంత్రణలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పర్యాటకులు, భక్తులకు రాత్రి వేళ అందుబాటులో ఉండే హోటళ్లు, రెస్టారెంట్లను 10 గంటలకే మూసివేయిస్తున్న పోలీసులు.. తెల్లవార్లూ తెరిచే ఉంటున్న బెల్ట్ షాపుల విషయంలో మాత్రం చూసీచూడనట్లుగా ఉంటున్నారనే చర్చ తీవ్రంగా నడుస్తోంది. ఇటీవల పలు కాలనీల్లోనూ చోరీలు సైతం పెరిగాయి. మామూళ్లపై ఉన్న ఆసక్తి నేరాలను అరికట్టడంలో కొంతమంది పోలీసు అధికారులకు లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తాం



భద్రాచలంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా వ్యవస్థ, పెట్రోలింగ్‌ను పటిష్టపరుస్తాం. పని చేయని సీసీ కెమెరాలను పునరుద్ధరించడంతో పాటు కొత్తవి ఏర్పాటు చేస్తాం. నిషేధిత గంజాయి, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాల సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందజేసి సహకరించాలి.

– అంకిత్‌కుమార్, భద్రాచలం ఏఎస్పీ

పెట్రోలింగ్ వాహనాలు పెంచాలి

టెంపుల్ సిటీగా పేరుగాంచిన భద్రాచలంలో పోలీసుల రక్షణ, నిఘా వ్యవస్థను పటిష్టపర్చాలనే డిమాండ్ వినిపిస్తోంది. పట్టణంలో విస్తరిస్తున్న కాలనీల్లో జనాభాకు అనుగుణంగా పెట్రోలింగ్ ద్విచక్ర వాహనాలను పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల బ్రిడ్జి పై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. గంజాయి, పశువుల అక్రమ రవాణాకు ఈ బ్రిడ్జి మార్గమే కీలకంగా మారింది. ఈ ప్రాంతంలో ఉదయం, రాత్రి వేళల్లో నిరంతరం గస్తీ పెట్టాలని, బ్రిడ్జిపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇటీవల గోదావరి బ్రిడ్జి క్రింద దొరికిన మృత శిశువు కేసులో సీసీ కెమెరాల నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఘటన జరిగి పది రోజులైనా బాధ్యులను ఇప్పటికీ గుర్తించలేదు. ఓ గిరిజన యువతి బయటకు వచ్చి వీడియో వాంగ్మూలం ఇచ్చిన తర్వాతే కేసు దర్యాప్తులో వేగం పుంజుకుంది. ఇలాంటి ఘటనల నేపథ్యంలో ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతున్న భద్రాచలంలో రక్షణ, నిఘా వ్యవస్థను పటిష్టపరచాలని పలువురు కోరుతున్నారు.

కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోంది..

- రుణమాఫీపై మంత్రుల్లో భిన్నస్వరాలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని, పక్కన పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: పాలకులు అనుసరిస్తున్న విధానాల నేపథ్యాన కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టు వ్యతిరేకులు సైతం తమ అవసరాన్ని గుర్తిస్తుండగా.. పేద, మధ్యతరగతి ప్రజలు కమ్యూనిస్టుల బలోపేతాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. సీపీఐ ఖమ్మం జిల్లా సమితి సమావేశం బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో బీజీ.క్లెమెంట్ అధ్యక్షతన జరగగా కూనంనేని మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేందుకు బలమున్న ప్రతీచోట పోటీ చేయాలని సూచించారు. అవగాహన, పొత్తును స్వాగతిస్తూనే పార్టీ పోటీచేసే స్థానాల సంఖ్య పెంచాల్సిన అవసరముందన్నారు. కాగా, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇక రాష్ట్రంలో రుణమాఫీ సహా కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజల్లో నిరాశ ఉండడమే కాక రుణమాఫీపై మంత్రుల నుంచే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయని తెలిపారు. రైతులు ఆందోళన బాట పడుతున్నందున ప్రభుత్వం తక్షణం స్పందించకపోతే గందరగోళం నెలకొంటుందని చెప్పారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకే జరిగే రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర, జాతీయ అంశాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

వయనాడ్ బాధితులకు విరాళం..

ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన కేరళ రాష్ట్రం వయనాడ్‌లోని బాధితులకు సీపీఐ శ్రేణుల ద్వారా సేకరించిన మొత్తాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శికి అందజేశారు. మొత్తం రూ.1,15,578 చెక్కును కూనంనేనికి జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఇచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జితేందర్‌రెడ్డి, ఏపూరి లతాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎం పర్యటన వాయిదా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం సింగరేణి ఏరియా పరిధిలోని వీకే–7ఓసీ గని విస్తరణలో భాగంగా నిర్మించిన జనరల్ మేనేజర్ కార్యాలయం, వర్క్‌షాప్‌ను గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని అధికారులు ఇటీవల షెడ్యూల్ విడుదల చేశారు. అయితే, డిప్యూటీ సీఎం ఇతర కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండడంతో ప్రారంభోత్సవాలను వాయిదా వేసినట్లు తెలిపారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి డిప్యూటీ సీఎం కొత్తగూడెం రానున్నారనే సమాచారంతో కొద్దిరోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు అంతా సిద్ధం చేశారు. మామిడి తోరణాలు కట్టి, పూలకుండీలు ఏర్పాటు చేయడమే కాక గోడలకు రంగులు వేయించి ముస్తాబు చేయగా భట్టి పర్యటన వాయిదా పడిందని తెలియడంతో పనులు నిలిపివేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఏఎస్పీ అంకిత్ కుమార్

భద్రాచలంఅర్బన్: రోడ్డు ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన భద్రాచలం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ మధుప్రసాద్, ఏఎస్‌ఐలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు క్లినికల్ శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్‌లో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) ఒకేషనల్ కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏడాది క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యాధికారి హెచ్.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, బూర్గంపాడు, అశ్వారావుపేట, ఇల్లెందు, చర్లలోని టీవీవీపీ ప్రభుత్వ ఆస్పత్రులలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికై న విద్యార్థులు రూ.1000 డీడీలు ఇవ్వాలని, గతంలో దరఖాస్తులు చేసుకుని ఎంపికకాని వారు కూడా తాజాగా దరఖాస్తులు చేసుకోవాలని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు బయోడేటా ఫారంతోపాటు ఆధార్ కార్డు, ఎస్‌ఎస్‌సీ మెమో, ఇంటర్మీడియట్ మెమోలు జత చేసి ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 2 వరకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

మణుగూరు టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మణుగూరులో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మానికి చెందిన ఓంకార్(26)కు గతేడాది మణుగూరుకు చెందిన ఉప్పాల భవానీ ధరణితో ప్రేమ వివాహం జరిగింది. కొద్ది రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం మణుగూరు వచ్చిన ఓంకార్ గొడవల మంగళవారం రాత్రి కలుపు మందు తాగాడు. భార్య, కుటుంబ సభ్యులు 100 పడకల ఆస్పత్రికి, అక్కడి నుంచి భద్రాచలం తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి అశోక్‌లాల్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మేడ ప్రసాద్, భార్య మరోవ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని తాపీ మేస్త్రీ..



వెంకన్న(ఫైల్)

పాల్వంచ: పట్టణంలో ఓ తాపీ మేస్త్రీ బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం .. బొల్లేరుగూడెం ఏరియాలో నివాసం ఉండే మేస్త్రీ దారోగ వెంకన్న(48) కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు మకాం మార్చాడు. రాఖీ పండుగ రోజు పాల్వంచలోని తన ఇంటికి వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు వచ్చే సరికి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నాడు. వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం గదికి తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ రాఘవయ్యను వివరణ కోరగా.. మృతుడి కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి రావాల్సి ఉందని, మృతికి గల కారణాలపై ఫిర్యాదు ఇంకా అందలేదని తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుని ఇద్దరు వ్యక్తులపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనగరం గ్రామంలోని మాలోజు శివకుమార్ ఇంటి వద్ద పోలీసులు తనిఖీ చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో శివకుమార్‌తోపాటు కె.లక్ష్మీపురం గ్రామానికి చెందిన అనంతుల రమేష్‌పై కేసు నమోదు చేశారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.30 వేలు వరకు ఉంటుందని ఎస్‌ఐ వెంకటప్పయ్య తెలిపారు.

అరకొరగా 'డయాలసిస్' పడకలు

- రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ రోగులు
- ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే ఆర్థికభారం
- డయాలసిస్ కేంద్రాలు, పడకలు పెంచాలని బాధితుల వేడుకోలు



జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో రక్తశుద్ధి చేయించుకుంటున్న బాధితులు

కొత్తగూడెంరూరల్/ఇల్లెందు: జిల్లాలో కిడ్నీ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వారికి రక్తశుద్ధి చేసేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రాల్లోని పడకలు సరిపోవటం లేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సివస్తుండటంతో ఆర్థికభారం పడుతోంది. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో 5 పడకలు, భద్రాచలం ఆస్పత్రిలో 10, మణుగూరులో 5, ఇల్లెందులో 5, అశ్వారావుపేటలో 5 పడకలు ఉన్నాయి. వీటిలో జిల్లా కేంద్రంలోని కిడ్నీ డయాలసిస్ కేంద్రంలో 40 మంది, ఇల్లెందులో 10, మణుగూరులో 10 మంది రక్తశుద్ధికి వెయిటింగ్‌లో ఉన్నారు. వీరిలో ఎవరైనా చనిపోతే తప్ప మరొకరికి రక్తశుద్ధి చేసుకునే అవకాశం ఉండదు.

ఆరు నెలలైనా..

గత ఆరు నెలల క్రితం అక్కడి ఎమ్మెల్యేల చొరవతో పాల్వంచ, చర్ల ఆస్పత్రులకు డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేశారు. వీటి నిర్మాణంతోపాటు, నిర్వహణ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. కానీ ఇప్పటి వరకు అక్కడ సేవలు ప్రారంభంకాలేదు. అక్కడి రోగులు ఇల్లెందు లాంటి సెంటర్‌లో డయాలసిస్ పొందుతున్నారు. కొత్తగూడెం నుంచి ఎనిమిది మంది, పాల్వంచ నుంచి 12 మంది బాధితులు ఇల్లెందుకు వచ్చి డయాలసిస్ పొందుతున్నారు. అక్కడి సెంటర్లు ప్రారంభమైతే ఇల్లెందులో మరికొందరికి డయాలసిస్ చేసే అవకాశం లభిస్తుంది. కాగా నెల రోజుల్లో ఈ రెండు కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని వైద్యశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే జేబు ఖాళీ..

బాధితులు ప్రైవేటు ఆస్పత్రుల్లో రక్తశుద్ధి చేయించుకునేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు అప్పులు చేయాల్సి వస్తోంది. జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం ప్రైవేటు ఆస్పత్రుల్లో వారానికి రెండు, మూడు సార్లు రక్తశుద్ధి చేయించుకుంటే జేబులు ఖాళీ అవుతున్నాయి. ఒకసారి డయాలసిస్‌కు రూ.2,500 నుంచి రూ. 3 వేలు ఖర్చు అవుతుంది. డయాలసిస్ చేసుకోకపోతే ప్రాణానికి ముప్పు వస్తుంది. ఫలితంగా అప్పు తెచ్చుకుని ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేసుకోవాల్సి వస్తోంది.

రోజూ 20 మందికే...

భద్రాచలం మినహా మిగిలిన చోట్ల డయాలసిస్ సెంటర్లలో ఐదు పడకల చొప్పున ఉన్నాయి. వీటి ద్వారా సెలవు దినాలు మినహా ప్రతీ రోజు 20 మందికి మాత్రమే డయాలసిస్ చేసే అవకాశం ఉంది. ఆయా డయాలసిస్ సెంటర్ల పరిధిలో రోగుల సంఖ్య పెరిగితే అక్కడి సమీపంలోని డయాలసిస్‌లో చేయించుకునే అవకాశం లేదు. జిల్లాలోని ఏ సెంటర్‌లో ఖాళీ ఉంటే అక్కడికి పంపిస్తారు. దీంతో బాధితులపై రాకపోకల భారం పడుతోంది.

సర్వజన ఆస్పత్రిలో పడకలు పెంచాలి

జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో ఉన్న ఐదు పడకలు సరిపోక పోవడంతో కిడ్నీ రోగులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. పడకల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రతి నెలా 40 నుంచి 50 మంది వెయింటింగ్‌లో ఉంటున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని మరికొన్ని డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేయించాలని, జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో మరో 10 పడకలు పెంచాలని పలువురు కోరుతున్నారు.

శాస్త్రీయ సర్వే, పరిశోధన జరగాలి

రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ రోగాల నివారణకు శాస్త్రీయ సర్వేతోపాటు పరిశోధన చేయాలని పలువురు వైద్యులు కోరుతున్నారు. కలుషిత తాగునీటితోపాటు పెయిన్ కిల్లర్ మందులు వాడటంతో కిడ్నీ రోగుల సంఖ్య పెరుగుతుందని పేర్కొంటున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.

సర్దుబాటు చేస్తున్నాం

కొత్తగా రోగి డయాలసిస్ కోసం అడ్మిషన్ పొందితే సర్దుబాటు చేస్తున్నాం. అయితే ఆ రోగికి మా వద్ద ఖాళీగా ఉన్న సమయం అనుకూలంగా డయాలసిస్ చేస్తున్నాం. లేకపోతే జిల్లాలో ఎక్కడ ఖాళీ లభిస్తే అక్కడికి పంపిస్తున్నాం. పాల్వంచ, చర్ల కేంద్రాలు ప్రారంభమైతే ఇల్లెందుకు రిలీఫ్ లభిస్తుంది. అప్పుడు మరికొందరికి సర్దుబాటు చేయవచ్చు.

– డాక్టర్ జి.హర్షవర్ధన్, సూపరింటెండెంట్, ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి



పుస్తకాలను నిమజ్జనం చేస్తున్న ఈఓ రమాదేవి



గోదావరికి నదీ హారతి సమర్పిస్తున్న వేద పండితులు

వైభవంగా శ్రీరామకోటి పుస్తకాల నిమజ్జనం

భారీగా తరలివచ్చిన రామభక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి భక్తులు సమర్పించిన శ్రీరామకోటి పుస్తకాలను బుధవారం పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శ్రీరామకోటి పుస్తకాలను మంగళవాయిద్యాలు, అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ గోదావరి బ్రిడ్జిపైకి తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పుస్తకాలను నిమజ్జనం చేశారు. ఆ తర్వాత గోదావరికి నదీహారతి సమర్పించారు. ఈ వేడుకకు వేలాదిగా భక్తులు తరలిరాగా ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఒక షాపు, తలనీలాల వేలం పాట పూర్తి

ఆదాయం తక్కువ వచ్చినా అప్పగించిన వైనం



బాక్స్‌లో టెండర్ వేస్తున్న పాటదారు

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) పరిధిలో షాపులు కేటాయింపుతో పాటు వివిధ పనుల కోసం బుధవారం వేలం నిర్వహించగా ఒక షాపుతో పాటు తలనీలాలు పోగు చేసుకునే హక్కును వ్యాపారులు దక్కించుకున్నారు. ఆలయానికి చెందిన నూతన కాంప్లెక్స్‌లోని మూడు, పాత కాంప్లెక్స్‌లోని రెండు షాపులతో పాటు తలనీలాల సేకరణ, గతంలో సేకరించిన తలనీలాల విక్రయం, ఇతర పనుల కోసం వేలం నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పర్యవేక్షణాధికారి పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారి పర్యవేక్షించగా పాత కాంప్లెక్స్‌లోని నాలుగో నంబర్ షాపు కోసం నలుగురు పోటీ పడగా నెలకు రూ.42వేల అద్దెతో దక్కించుకున్నారు. అయితే, గతంలో ఇదే షాపును రూ.46వేల అద్దెతో కేటాయిస్తే ఈసారి రూ.4వేలు తక్కువకే అప్పగించడం గమనార్హం. ఇక తలనీలాలు పోగు చేసుకునేందుకు ఐదుగురు టెండర్లు దాఖలు చేయగా 11నెలల కాలానికి రూ.9.50లక్షలతో అప్పగించారు. గత ఏడాది రూ.24లక్షలకు కేటాయించగా ఈసారి రూ.9.50లక్షలకే అప్పగించడంతో రూ.14.50లక్షల ఆదాయానికి గండి పడింది. కాగా, మిగతా షాపులు, ఇతర పనుల కోసం ఎవరూ ముందుకు రాకపోవడంతో వచ్చే నెల 2వ తేదీకి వేలం వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు. అలాగే, షాపు, తలనీలాల హక్కులను తక్కువకు కేటాయించడంపై స్పందిస్తూ ఆరు సార్లు వేలం నిర్వహించినా ఇదే పరిస్థితి ఉండడంతో నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రేమ వివాహం



వధూవరులను ఆశీర్వదిస్తున్న గ్రామపెద్దలు

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన పసుపులేటి ప్రశాంత్‌కు, కొత్తగూడేనికి చెందిన ముత్తారపు నాగభవానికి మధ్యవర్తి ద్వారా సంబంధం కుదుర్చుకునేందుకు పెళ్లి చూపులు ఏర్పాటు చేసుకున్నారు. కానీ పెళ్లికి వధువు తరపున పెద్దలు అంగీకరించలేదు. పెళ్లి చూపుల్లో ఏర్పడిన పరిచయంతో ప్రశాంత్, నాగభవాని ప్రేమించుకున్నారు. స్నేహితుల సహకారంతో మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ నాయకులగూడెం పెద్దలను ఆశ్రయించారు. ఇద్దరూ మేజర్లు కావడంతోపాటు వరుడి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించడంతో గ్రామంలోని శ్రీకృష్ణుని ఆలయంలో సంప్రదాయబద్ధంగా వివాహం చేసి ఆశ్వీరదించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సూర్నపాక రామయ్య, గొగ్గెల లక్ష్మయ్య, చీమల వినోద్, పాయం రాంచందర్, చింత రమేష్, మొగిలి శ్రీనివాస్, కల్తి రాజ్‌కుమార్, చీమల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలు ఉపకరణాలు పొందాలి



మాట్లాడుతున్న జిల్లా సమ్మిళిత విద్యా కో–ఆర్డినేటర్ సైదులు

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగుల పరికరాలు, ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమ్మిళిత విద్యా కో ఆర్డినేటర్ ఎస్‌కే సైదులు సూచించారు. బుధవారం పాతకొత్తగూడెం పాఠశాలలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సమగ్ర శిక్ష, భారత కృత్రిమ అవయవాల ఉపకరణాల సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లల పరికరాలు, ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని 27న ఆనందఖని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలో 18 సంవత్సరాల లోపు వయసు కలిగిన దివ్యాంగ పిల్లలకు అవసరమైన పరికరాలు, ఉపకరణాలను ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. శిబిరానికి వచ్చేవారు రెండు ఫొటోలు (శారీరక వైకల్యం కనిపించే విధంగా), ప్రభుత్వం మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం/రేషన్ కార్డు, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు తెచ్చుకోవాలని సూచించారు.

చెరువులో మునిగి ఇద్దరు బాలురు మృతి

సిద్దిపేట జిల్లా కొండపాకలో ఘటన



బాలుర మృతదేహాలు

ఇల్లెందు: చెరువులో మునిగి ఇల్లెందుకు చెందిన ఇద్దరు బాలురు మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామంలో బుధవారం జరిగింది. ఇల్లెందు 24 ఏరియాకు చెందిన బస్వరాజ్ మల్లేష్ సమీప బంధువు సముద్రాల ఆంజనేయులు గృహప్రవేశ వేడుకకు కుటుంబంతో సహా వెళ్లారు. మల్లేష్ కుమారుడు హేమంత్(17) వెంట తన స్నేహితుడైన నిఖేష్‌వర్ధన్(13) కూడా వెళ్లాడు. అందరూ శుభకార్యం హడావిడిలో ఉండగా హేమంత్, నిఖేష్‌వర్ధన్‌లతో పాటు ఆంజనేయులు కుమారుడు అరుణ్ కలిసి సరదాగా గ్రామ సమీపంలోని ఊరచెరువు వద్దకు వెళ్లారు. చెరువులో దిగి ఇద్దరు బాలురు మునిగిపోతుండగా అరుణ్ కేకలు వేశాడు. దీంతో సమీపంలోని వారు వచ్చి మునుగుతున్న ఒకరిని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే మరో బాలుడు గల్లంతుకాగా, గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. ఇద్దరి బాలురి మృతితో మృతితో ఇల్లెందు 24 ఏరియాలో విషాదం అలుముకుంది. కాగా హేమంత్ ఇంటర్ ఫస్టియర్, నిఖేష్వర్ధన్ 8వ తరగతి చదువుతున్నారు.

వృక్షం .. ఛత్రం



ములకలపల్లి ఏపీజీవీ బ్యాంక్ ఎదుట ఉన్న పెద్ద కానుగ చెట్టు నీడన ఖాతాదారులు సేదతీరుతున్నారు. రుణమాఫీ నేపథ్యంలో రోజూ వందలాది మంది రైతులు, ఇతర వినియోగదారులు బ్యాంక్‌కు వస్తున్నారు. సకాలంలో పనులు కాకపోవడంతో రోజంతా నిరీక్షించాల్సి వస్తోంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో కానుగ చెట్టు నీడలో కాస్త సేద తీరుతున్నారు. ఇక ద్విచక్రవాహనాలకు పార్కింగ్‌లాగా మారిపోయింది. –ములకలపల్లి

వీటీపీఎస్‌లో గాయపడ్డ వ్యక్తి మృతి

పాల్వంచ: వీటీపీఎస్ కర్మాగారంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కొమ్ముగూడేనికి చెందిన ఏనిక పాపయ్య (54) పదేళ్లుగా దుర్గ ఇంజనీరింగ్ కంపెనీలో షట్ డౌన్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్‌కు షట్ డౌన్ పనుల నిమిత్తం వెళ్లాడు. ఈ నెల 13న పనులు చేస్తున్న క్రమంలో ఇనుప చానల్ మీద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో వైద్య పరీక్షలు చేయించుకుని 17న ఇంటికి వచ్చాడు. అనంతరం కుటుంబ సభ్యులు పాల్వంచ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ క్రమంలో 19న సాయంత్రం పడుకుని చనిపోయాడు. మృతికి కారణమైన ఇంజనీరింగ్ కంపెనీ యజమాని రాజబాబు, సూపర్‌వైజర్ తేజలపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతుడి కుమారుడు వీరభద్రం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

ఇల్లెందు: మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న వ్యక్తిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ముత్తారపు కట్టకు చెందిన ఎం. ఉమాను ఖమ్మం సమీపంలోని వెవెలుగుమట్ల గ్రామానికి చెందిన బి.వెంకటాచారికి ఇచ్చి 2018లో వివాహం చేశారు. కొంత కాలంగా అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి. సూర్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రఘునాథపాలెం: రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు రఘునాథపాలెంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని గురుకులాల ఆర్‌సీఓ ఆంజలి తెలిపారు. పాఠశాలక చెందిన లోకేష్, గణేష్, ఎస్.నాగచైతన్య, సాయి, సాయి మణికంఠ, కాళీచరణ్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చగా ఈ నెల 25, 26వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీరిని ఆర్‌సీఓతోపాటు హెచ్‌ఎం సంజీవరావు, పీఈటీ కృష్ణ బుధవారం అభినందించారు.

సింగరేణిలో మెగా వనమహోత్సవం



మొక్క నాటుతున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ వ్యాప్తంగా బుధవారం మెగా వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో కొత్తగూడెం ఏరియాలో డైరెక్టర్ (పీఅండ్‌పీ) జి. వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొని సుమారు 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడగా.. ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు, ఏజీఎం వివేక్ బాబు, ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా కరువు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈ నెల 13న భద్రాచలంలో గోదావరి మధ్యలో ఉన్న రాళ్ల వద్ద మృత శిశువు లభించిన ఘటనపై పోలీసులు విచా రణ సాగిస్తున్నారు. అయితే జిల్లా వైద్య ఆరో గ్య శాఖ అధికారులు మాత్రం ఇప్పటివరకు పట్టణంలోని ఏ ప్రైవేట్ ఆస్పత్రినీ తనిఖీ చేయలేదు. పట్టణంలోని రక్తపరీక్షా కేంద్రాలపై వైద్య శాఖ ఇటీవల కాలంలో తనిఖీల నిర్వహించిన దాఖలాలు లేవు. కొన్ని మెడికల్ షాపుల నిర్వాహకులు అనుమతులు లేకుండా ప్రతి ఆదివా రం ప్రత్యేక వైద్య నిపుణుల పేరుతో అమాయక ప్రజలను దోచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడి ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్‌లు, రక్తపరీక్షా కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మావోయిస్టు పీఎల్‌జీఏ సభ్యుడి లొంగుబాటు

చర్ల: మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ హిడ్మా బెటాలియన్ నంబర్–1లో పని చేస్తున్న పీఎల్‌జీఏ క్రియాశీలక సభ్యుడు, మైనర్ బుధవారం ఒడిశాలోని మలకన్‌గిరి జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధి సిలిగేరు గ్రామానికి చెందిన 16 యేళ్ల బాలుడు ముఖేష్ కొర్సా 2023లో మావోయిస్టు పార్టీలో చేరాడు. హిడ్మా నేతృత్వంలో పనిచేస్తుండగా, ఇతనిపై ఐదు కేసులు ఉన్నాయి. లొంగిపోయిన మావోయిస్టుపై ఒడిశాలో రూ. 2 లక్షల రివార్డు ఉండగా, దానిని ఇప్పించేందుకు కృషి చేస్తామని అక్కడి పోలీసులు తెలిపారు.

రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని గాండ్లగూడేనికి చెందిన మాలోతు అర్జున్‌కు, అదే గ్రామానికి చెందిన నవ్యతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా, సుమారు నాలుగు నెలల క్రితం అర్జున్ మరో మహిళను వివాహం చేసుకున్నాడు. బాధితురాలు నవ్య ఫిర్యాదు మేరకు అర్జున్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో ఆరుగురిపై...

పాల్వంచరూరల్: పాత కక్షల నేపథ్యంలో ముగ్గురిపై దాడి చేసిన ఘటనలో బుధవారం పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని తోగ్గూడెంతండాకు చెందిన మాలోతు బాహుసింగ్, విజయరామారావు, విష్ణులపై ఈ నెల12న అదే గ్రామానికి చెందిన కేశోతు బాలు, వీరు, శ్రీను, గోపి, కవిత, లలితలు దాడిచేసి గాయపరిచారు. బాధితుడు బాహుసింగ్ ఫిర్యాదుమేరకు దాడిచేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

9 లీటర్ల సారా పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా తరలిస్తున్న నాటు సారాను బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన నూనావత్ రవి, కమల దంపతులు బైక్‌పై 4 లీటర్లు తీసుకెళ్తుండగా టేకులపల్లిలో, తొమ్మిదోమైలుతండా వద్ద శంకర్ అనే వ్యక్తి నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ అచ్చారావు తెలిపారు. బైక్‌ను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది రవిబాబు, తులిస్యా పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక, జగ్యా తండా గ్రామాల్లో వేర్వేరు దాడుల ఘటనల్లో ముగ్గురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.